చెట్టంత కొడుకుని
చూసిన కన్నవారికి
కొడుకుకన్నా
చెట్టేనయమని
ఎందుకనిపించింది?

# చెట్టంత కొడుకు

శివరాజు అంజలి
కథ


కాలప్రభువు ఆజ్ఞ ధిక్కరించలేని రాత్రి సైనికుడు చీకటి చక్రం తిప్పుతూ లోకానికి వచ్చి చాలాసేపు గడిచింది. ఆ పల్లెటూళ్లో వూరి చివర కనిపించే తోటకి ఎగువన ఓ గుడిసె నిశ్శబ్దంగా కూర్చున్నట్లుంది.

గుడిసెలో గుడ్డిదీపం వెల్తురులో తలవంచి శ్రద్ధగా చదువుతున్నాడు సూరిగాడు. గుడిసె ముందు ముడుచుకుని కూర్చున్న రామయ్య చేతిలో చుట్ట చురుక్కుమని కాలితే, పారేసి లేచి నిలబడ్డాడు. రామయ్యకి మహా చిరాగ్గా వుంది. ఓ ప్రక్కన ఆకలి కరకరలాడుతోంది. కానీ లక్ష్మమ్మ తెమిలి వచ్చి, బువ్వెట్టే ఊసే కనబడలేదు. అప్పటికీ గుడిసెలోకి, పందిట్లోకి నాలుగుసార్లు తిరిగాడు. కానీ లాభం లేదు!

ఇదేమీ పట్టనట్టు, లక్ష్మమ్మ శ్రద్ధగా, తన జీవిత లక్ష్యం ఇదేనన్నట్లు, వెలిసిపోయిన మురికి గుడ్డల్ని, బండపై దబ్బుదబ్బున నాల్గు దెబ్బలేసి, అన్నిట్నీ పక్కనున్న పగిలిన బానలో జాడించేసి, ఆ నీళ్లన్నీ పక్కన చెట్లకి పోస్తోంది. పాదునిండిన చెట్టు నుండి మరో పాదుకి వేళ్లతోనే కాల్వలు తీసి పారిస్తోంది!

మళ్లీ ఓసారి గుడిసెలోకి తొంగిచూసిన రామయ్య ఇక వూర్కే వుంటే లాభం లేదనుకుని "ఒసే లచ్మీ! పిల్లోడికి నిద్రొస్తాందే! నీ చెట్లు ఏడకి బోతై? రాత్రికి రాత్రి! రేప్పొద్దున నీళ్లోయచ్చులే! జల్దీరా! దొర పిల్సిండు. వేగూడ బేగిపోవాల! బువ్వెడ్డుగానీ రావే! అని పిలిచాడు.

"వస్తన్నానయ్యా! ఇయ్యాల్టికి నాల్గుదినాలాయె, చెట్లపాదులు తడిపి. ఆటికి నోరా, వాయా సెప్పు? మన్కి ఆకలి తెలిపి



కూడా వాటినెండ గడతవా ఏంది? వస్తన్ననా ! అని మట్టికడిగిన తడిచేతులు కొంగుకి తుడుచుకుంటూ లోనికి వచ్చింది.

అన్నంలో ధనియాల కారం కల్పు కుంటూ చెప్పాడు రామయ్య. ఇవ్వాళేమైందో ఎరికేనా లచ్మీ? అని.

సూరిగాడు తలవంచి ముసిముసిగా నవ్వుకోసాగాడు.

''మీ అయ్య సెప్పేటాళ్కి, తెల్లారిపోద్ది కొడకా, నువ్వు సెప్పరా? అంది లక్ష్మమ్మ''

'వూహూ, నే సెప్పనే, నాన్నే సెప్పాల! అన్నాడు తండ్రికి వంతపాడుతూ!

భార్యని ఇంకొంచెం వుడికిస్తూ 'ఐందా నీపని! నేనే సెపుతాగదే!' ఇయ్యాల మన పంతులుగారాపడ్డారు చెరువుకాడ! 'ఒరే రాములూ! నీ జల్మ పండిందిరా! నీ బుడ్డోడు మన జిల్లాలోనే పస్టున పాసయ్యేట్టున్నాడురా! వాడి తెలివి, వాడి మార్కులు, వాడి దస్తూరి, మాకే అబ్బురంగా వుందిరా! అన్నారు. మనకేమో పోరడు చదుకుంటానికి ఆ యమన్న దీపం బుడ్డికూడా, కరువేనాయిరి! అన్నాడు.

లక్ష్మమ్మ సంబరం చెప్పనలవి కాదు. ఎండన చేసే మడిసని, రోజు పోసే చల్లతేట సూరిగాడి సత్తుగిన్నెలో పోసిందివ్వాళ! 'ఏవయ్యోవ్, నా ముంగట అన్నావ్‌గానీ, ఎవ్వరితో పొక్కనీకు! బుడ్డోడికి జిట్టి దగిలేను! కన్నోళ్ల సూపు అస్సలు దగలరాదు! కన్నోళ్లు పోరల్ని, అస్సలు మెచ్చరాదంట! ఐనా మనకాడ సిల్లి గవ్వలేదు. ఈడి సదువెట్టా? రెక్కాడితేగాని డొక్కాడని బతుకు? అని మెటికలు విరిచి, దిష్టి తీసింది పిల్లాడికి.

ఆ రాత్రికి పడుకున్నదన్నమాటేగాని, లక్ష్మమ్మ కంటికి కునుకు లేదు. పిల్లోడు డాకటేరో, కలకటేరో అవ్వాలనీ కాలినడకన ఏడుకొండలెక్కుతాననీ మొక్కుకుంది. ఆడి సదువు ఆగిపోకుండా, దొడ్లో కూరగాయలు ఇబ్బడిముబ్బడిగా కాయించమని నేలతల్లికి మూరుసార్లు దణ్ణంపెట్టుకుంది.

లక్ష్మమ్మ పగలల్లా పెరట్లో పనిచేస్తుంది. అత్తారింటికి వచ్చినప్పటి నుండి పెంచిన తోటనోకంట, వయసుడిగాక కన్న కొడుకునో కంట, పెంచి పెద్దజేస్తున్నది. రామయ్య దొరోరి గడీలో కొలువుచేసి తెచ్చిన గింజలు అట్టట్టగా తిండికి ఎల్తే, తాను పెంచే తోటలోని కూరలు, కాయలు, పండ్లు, సూరిగాడి సదువుకెల్తావుంది. గంపనిండా కూరలెల్తే సూరిగాడికి కళ్లపంటగా వుంటుంది. వాడికి పుస్తకమో, పెన్నో కావాల్సి వచ్చినప్పుడు పెరట్లో పనికి సాయపట్టానికి వెళ్తాడు. ఆడు పెరట్లోకి వస్తే చాలు లక్ష్మమ్మకి గుర్తే! వాడికేదో కావాలని! ఇంటాయన్ని మాత్రం సాయం అడగదు!

తానే బావిలో నీళ్లు తోడి, తోటకి పెడ్తుంది. స్నానం చేసినా, బోలెలు తోమినా, మురికి నీళ్లు ఐనా సరే, ఓ చుక్క కూడా విడిగా పోనీకుండా, చెట్లల్లో పోస్తుంది. 4 ఏండ్ల క్రితం నాటిన జామ చెట్లు పిందెలు వేస్తుంటే, సూరిగాడు కొత్త బట్టలేసుకుని కాలేజీకి వెళ్లినంత సంబరపడిపోయింది. ఎప్పుడో ఓసారి పంతులుగారు వచ్చి లక్ష్మమ్మా! నీ కష్టం వూర్కే పోదు! చెట్టంత కొడుకుని కన్నావు! వాడు మేలిమి బంగారం లక్ష్మమ్మా! మేలిమి బంగారం! ముసలితనాన ముఖపెడ్తాడులే' అని మెచ్చుకుంటాడు!

పదిసార్లు రాసినా పాస్ కాని తన కొడుకును గూర్చి దిగులు ఆయన కండ్లలో తారాడినా, శిష్యుని చూచి మనసారా పొంగిపోయే దొడ్డబుద్ధి ఆయనకి సహజాతం! మజ్జిగతేట చేతికిచ్చి, అంతా మీ సూపు

సలవ బాబుగారూ! అంటుంది లక్ష్మమ్మ అమాయకంగా!

కాలచక్ర భ్రమణంలో పది తొలకరులు చూశారు లక్ష్మమ్మ రామయ్యలు, సూరిగాడు సూర్యనారాయణయ్యాడు. బస్తీలో మంచి ఉద్యోగమే సాధించుకున్నాడు. ఉద్యోగం వచ్చాక వాడి రాకపోకలు తగ్గినై. ఇప్పుడు ఏడాదికోసారే వస్తున్నాడు. కాలం మారుతోంది అంటే, అర్థంకాని ఆ ముసలాళ్లకి నిజం తెలిసిందిప్పుడు కాలం తనతోపాటుగా మనుషుల్ని కూడా మారుస్తుందని!

ఈ మట్టి వాసన, ఈ చిత్తడి పెరడు! పేదరికానికి కొలమానంలాంటి పూరి గుడిసె! తన తెలివి ఇక్కడే కన్ను తెరిచిందనేది, ఈనాటి బస్తీ పోకలకి, తారు రోడ్లకి, అంతస్థుల భవనాలకి దారి చూపిందనే సంగతి మర్చిపోడానికి మూడేళ్లే చాలింది సూరిగాడికి! అతని తప్పూ ఏం లేదు. సకల సదుపాయాలు కల్గిన, ఓ ఆఫీసరు పిలిచి పిల్లనిచ్చి, పెళ్లి చేస్తానంటున్నాడు!

అన్నీ వివరంగానే చెప్పాడు పాపం! గడియల్లో గుడిసె ఖాళీ చేయమన్నాడు. బస్తీలో కాలుకింద పెట్టకుండా చూసుకుంటానన్నాడు! రామయ్య గుండెల్లో సుడిగుళ్ల కప్పిపుచ్చుకున్నా, లక్ష్మమ్మ పేగుల్లో చెప్పరాని బాధ సలుపుతోంది. ఒక్కసారి కూడా, పిల్లడి కన్నవాళ్లని చూడకుండా, వూరూపేరు తెల్సుకోకుండా పెళ్లేమిటో! వారికేమీ పాలుపోలేదు! వారం రోజులాగి ఓసారి రమ్మన్నారు. కానీ వాడు రాలేదు. రామయ్య రాడని నిశ్చయించుకున్నా, లక్ష్మమ్మ కండ్లు దారులు కాస్తూనే వున్నాయి. వచ్చినా ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో అని మల్లగుల్లాలు పడిపోయి, పంతులుగార్ని పిల్చి, గోడంతా సెప్పుకున్నారు.

ఆయన విని ఉత్తరం రాశాడు: "ఈ వూరూ, ఈ గుడిసె, ఈ సెట్లూ, వదలి వుండలేంరా బాబూ! సల్లగాలి కావలన్నా, కమ్మటి పెరుగు కావాలన్నా, తొలకరి జల్లుల, నేలతల్లి సువాసన కావాలన్నా,

## గుర్తింపు

*"నన్ను ప్రేక్షకులు 'మాధురి'గా గుర్తించినప్పుడే నేను నంబరవన్నానే తప్ప.... సినీరంగం ఇచ్చే నంబర్లతో కాదు! ఈనాటికీ ప్రేక్షకులు మర్చిపోలేని నర్గీస్, మధుబాలలకు అప్పట్లో నంబర్లు ఉండేవా!" అని కూడా అంటోంది సినీ నటి మాధురీదీక్షిత్. సెహబాష్ మాధురీజీ!*



– జూపిటర్


మేం బతికే వున్నాంరా నాయనా! వచ్చి సూసిపోరా కొడుకా!'' అని వాళ్ల గుండెల్లో మమకారాన్నంతా, ముంచితీసి రాశాడు.

తొలీత పండు అయ్యగారు! రెండు ముక్కలు తినండి! అని లేత మామిడి పిందెలు కోచి తెచ్చింది లక్ష్మమ్మ. కుక్కి మంచం తెచ్చి మామిడి చెట్టునీడన వేసి 'కూకోండయ్యా! ఎండనపడి వచ్చారు! ఒక్క కునుకు తీయండి బాబూ! ఆయిగా వుంటది!'' అన్నాడు రామయ్య. పంతులుగారు ''చూడు రామయ్యా! కళ్లల్లో వత్తులేసుకుని పెంచిన కొడుకు కాదని దూరం వెళ్లిపోయాడు. పనికిరాని నీళ్లోసి పెంచిన ఈ చెట్లు, చేతికొచ్చిన కొడుకులాగు, నీడనిచ్చి, గాలినిచ్చి పడుకోమంటున్నయ్! చెట్లకున్న విశ్వాసం, కొడుక్కి లేకపాయె! ఇదేం చిత్రమో! అంటే:

''ఏమో దొర! నాకేమెరుక! మీలాంటి మారాజులే చిత్రమంటంటే ఏం చేయగలం బాబూ! ఎవరికెంత రుణమో అంతేనట్టుంది! అని చలికిలపడ్డాడు. చుట్టగుడ్డ తలకింద పెట్టుకుని నేలపై వాలుతూ!

ఆ మాటలు వింటూ లక్ష్మమ్మ మంచం పక్కగా వున్న చెట్టు మొదలుకు చెయ్యి ఆన్చి, ఆవులిస్తు మేను వాల్చింది.

*



డిజైన్: ఆర్.తారాబాంకృష్ణ (హైదరాబాద్)